# గులాబీలు మోసగించాయి

"సౌజన్య"

సావిత్రికి గులాబీలంటే చాల యిష్టం శేఖర్ అంటే చాల అభిమానం - ఇరువురనూ అభిమానంతో ముంచాయి గులాబీలు!

శేఖర్‌కూ గులాబీలంటే యిష్టం. సావిత్రి జడలోని గులాబీలంటే చాల యిష్టం. గులాబీల వలనే సావిత్రిలోని అందాన్ని గ్రహించగల్గాడు.

ఒకనాడు :

కళాశాల సాంస్కృతిక వారోత్సవాల్లో ఆర్టు సెక్షనులో శేఖర్ డిమాన్‌స్ట్రేట్ చేస్తున్నాడు. విద్యార్థులందరూ ఉత్సాహంతో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

'మొగ్గా - పువ్వూ' అనే ఛాయా చిత్రం ఆర్టు సెక్షనులో చాల ఆకర్షణీయంగావుంది. వికసించనున్న ఓ గులాబి మొగ్గ. కన్నె వదనంలా వికసించిన మరో గులాబీ రెండాకుల రెమ్మలమధ్య ముళ్ళతో అతి సహజంగా వున్నాయి.

'పుష్పలావికలు' అనే వర్ణచిత్రం మరొకటి. ఇరువురు ప్రౌఢలు పూవులమ్ముచున్నట్లు వ్రాయబడింది. వారి అంగ సౌష్టవమూ, లావణ్యమూ ఎంతో నేర్పుతో చిత్రించబడింది. తామర తూడులావున్న వారి హస్తాలూ, వికసిత కలువల్లా నయనాలూ, విప్పారిన పద్మాల్లా వదనాలూ వుండి వారి కంఠాలలో పూలహారాలు అతి రమణీయంగా రంగుల్లో చిత్రించబడింది.

పై రెండు చిత్రాలూ శేఖర్‌లోని కళాపిపాస, హస్తలాఘవమూ ప్రకటిస్తున్నాయి. ఎగ్జిబిషన్‌లో శేఖర్ వ్రాసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణ యిస్తున్నాయి.

ఆనాడు :

గులాబీల చిత్రం చూడగనే సావిత్రికి ఏదో అవ్యక్త మధురమైన అనుభూతి యేర్పడింది సిగ్గుతో ముకుళిత సరోజంలా అయింది.

"శేఖర్ మీ చిత్రాలు చాల బావున్నాయండీ!"

"థాంక్యూ వెరీమచ్! ఏ చిత్రమో తెలుసుకోవచ్చా?"

"గులాబీలు"

"మీ జడలోని గులాబీలకన్నా బావున్నాయా?"

కిలకిలానవ్వింది సావిత్రి. ప్రీతి కల్గాడు శేఖర్.

చిత్రాల్ని చూస్తూ వుండిపోయింది సావిత్రి. సావిత్రినీ, ఆమె జడలోని గులాబీలనూ చూస్తూ నిశ్చల నిర్నిమేష నయనాలతో వుండిపోయాడు శేఖర్. ఆమెలోని ప్రతి కదలికనూ గమనిస్తున్నాడు.

శేఖర్‌తో ఏవో మాట్లాడాలనుకుంది సావిత్రి. ఎందుకో అతన్ని చూడగానే చాల సిగ్గేసింది, ఆమె మనోపథంలో వేయి తారలు మెరిశాయి. ఆమె హృదయ వీణను ఎవరో మీటినట్లయింది ఏవో నవరాగం ఆమెను గిలిగింతలు పెట్టాయి కాబోలు. ఆమెజడలోని గులాబీలతోబాటు చెక్కిళ్ళు ఎరుపెక్కాయి "వస్తాశేఖర్!" అంటూ చెంగున లేడిలా వెళ్ళబోయింది ఆమె జడ కుప్పెలు తగిలేసరికి శేఖర్ నిల్చొంతపోయాడు. కనీసం "సారీ" అని కూడా అనలేదు. క్షణంలో మెరుపులా వెళ్ళిపోయింది

ఓసారి నవ్వుకున్నాడు శేఖర్

ఆమె జడలోని గులాబీలు గుర్తొచ్చాయి "ఎంత చక్కగావుంది సావిత్రి!" అనుకున్నాడు. ఆమె వాల్జడలో ఎప్పుడూ మూడే మూడు గులాబీలు - రెండు ఎర్ర గులాబీలు - మధ్య ఓ తెల్ల గులాబీ రెండాకుల రెమ్మ మధ్య పరిమళంతో పరిహసించుకుంటూ వుంటాయి.

ఆమెకు గులాబీలు యిష్టంకాబోలు ఉదయమే హిమ బిందువులు రాలకముందే గులాబీలను తురుముకుంటుంది. కాలేజీ విద్యార్థినులందరిలోనూ సావిత్రి సోయగము గులాబీలతో ద్విగుణీకృత మయింది.

క్లాసులో శేఖర్ ఎప్పుడూ సావిత్రి జడలోని గులాబీలనే చూస్తూవుండేవాడు. చిరుగాలిలో గులాబి బాలలు శేఖర్‌ని చూస్తూ పక పక నవ్వుతూ వుండేవి.

సావిత్రికి శేఖర్‌తో కల్గిన పరిచయం పరమావధిగా. కాళరాత్రిలో ఆకాశంలో అలుముకున్న నల్లని మేఘాల అంచుల దాగుడుమూతలాడే మెరపు తీవలావుండేది. అతనితో మాట్లాడాలనే వాంఛ - అతని సహవాసం - సహజీవనం - తనఆశయం అనుకుంది సావిత్రి అతనిపై తనకేదో అధికారం వున్నట్లు తోచేది.

ఓసారి :

కాలేజీ వదలగానే వర్షం వస్తుంది. శేఖర్ వానలో తడుస్తూ యింటికి వెళ్తూ వుండగా సావిత్రి తన కారులోనే అతని యింటివద్ద వదలి వెళ్ళింది.

అప్పుడప్పుడు యిరువురూ సాయం సమయాల్లో పార్కుకు వెళ్ళేవారు. అతనితో చనువుగా మాట్లాడేది సావిత్రి. తనను "క్వీన్ ఆఫ్ రోజెస్" అనేవాడు.

శేఖర్ ఓ చిత్రకారుడు అతనికుంచె ఎన్నో చిత్రాలను రంగురంగులతో చిత్రిస్తుంది. తన జీవిత భాండంలో ఆశలనే రంగుల్తో ఎన్నో స్వప్నాల్ని శేఖర్ సృష్టిస్తాడు! అతనికే తన జీవన సర్వస్వం అర్పించాలనుకుంది. అతనిలోని కళాతృష్ణను పెంపొందింప చేయాలనుకుంది.

అతనే తను. తనే అతను. అతను తనవాడు -

శేఖర్ రెండురోజులు కాలేజికిరావేదు. కారణం తెలీదు ఎందుకో తనకు చెప్ప లేదు అతను కన్పించపోయేసరికి సావిత్రికి

ఏమీ తోచడంలేదు. సాయంత్రం కారులో శేఖర్ యింటికి వెళ్ళింది.

ఏదో చిత్రకళా ప్రదర్శనానికి పంపేందుకు ఓ చిత్రం రంగుల్తో వ్రాస్తున్నాడు. బాహ్యాన్ని మరచి శేఖర్ చిత్రానికి ఫినిషింగ్ టచ్స్ యిస్తున్నాడు. సావిత్రి రాకను గమనించలేదు.

చిత్రాన్ని పరీక్షగా చూసింది సావిత్రి. తన రూపాన్నే చిత్రించాడు. తను మొట్టమొదట ఎగ్జిబిషన్‌లో పలుకరించిన భంగిమ యథాతథంగా వ్రాశాడు. చిత్రంలో నున్న గులాబీలు రంగుల్లో ఎలా వ్రాశాడో కాని తన జడలోని గులాబీల కన్నా ఆకర్షణీయంగా కన్పించాయి.

తన ప్రతిరూపం చూసి సావిత్రి కొన్ని నిముషాలు నిమీలిత నేత్రాలతో నిశ్చలమైంది. ఏదో సంతృప్తి! తనంత అందగత్తె అని తనకంతవరకూ తెలీదు సావిత్రికి. తన జడలోని గులాబీలను యింకా రంగుల్తో దిదుతూ వున్నాడు.

శేఖర్ యింకనూ ఆమె రాకను గమనించనే లేదు. చిత్రం అడుగున "నా హృదయ రాణి" అని వ్రాశాడు.

"శేఖర్!" - అని పిల్చింది సావిత్రి

బొమ్మకు యింకనూ రూపు రేఖలు దిద్దుతూ వున్నాడు.

కొన్ని నిముషాలయాక వెనుకకు తిరిగాడు శేఖర్

"ఓ! సావిత్రి మీరా?"

ఆమె కనులలోనికి అమాయకంగా చూశాడు.

ఆమె ఊహా ప్రపంచంలో వున్నట్టు కన్పించింది. ఆమె తన ప్రతి రూపాన్ని చూస్తూ పారవశ్యంలో వుండి పోయింది. చిత్రం అడుగున వ్రాసిన "నా హృదయ రాణి" అనే శబ్దం ప్రతిధ్వనిస్తున్నట్టుంది. సావిత్రి చెప్పరాని అనుభూతితో తన ప్రతి రూపాన్ని పరిశీలిస్తూ వుంది. నయనాలలో నుండి రెండు కన్నీటి చుక్కలు రాలాయి. "శేఖర్! నీవే నాసర్వస్వం!" అనుకుంది మనస్సులో.

"సావిత్రి!" అని పిల్చాడు.

అతని హృదయం తేలికయింది. ఆమె నేదో అడగాలని ఎన్నాళ్ళ నుండో దాగిన కోరిక స్వరూపాన్ని సృష్టించుకుంది. తన కలలు నిజమవుతాయి. తనలోని కళ పరాకాష్ఠ నందుకోవాలంటే సావిత్రి తన దిగా - తన జీవన నావకు చుక్కానిగా వుండాలి.

"సావిత్రీ!" మరలా పిల్చాడు.

సంతోషాతిశయంలో అతని గొంతు మూగ పోయింది.

"నీకభ్యంతరం లేకుంటే వివాహం చేసుకుందాం సావిత్రీ. నీ అభిప్రాయం."

కొన్ని క్షణాలు నిశ్శబ్దాన్ని సృష్టించాయి.

"నీకు అంగీకారం అయితే రేపు కాలేజీకి వచ్చేప్పుడు నీజడలో రెండు తెల్ల గులాబీలు — మధ్య ఓ ఎర్రగులాబి వుంటే చాలు. నీ అభిప్రాయం గ్రహిస్తాను."

మౌనంగా బయలు దేరింది సావిత్రి.

యాంత్రికంగా అనుసరించాడు శేఖర్.

"శ్రమ కల్గించినందుకు క్షమించాలి" అంటూ వెళ్ళిపోతున్న కారునుచూస్తూ వుండి పోయాడు.

ఆమెను అవమాన పరచానని చాల బాధ పడ్డాడు.

ఆమెకు ఎంత కష్టం కల్గిందో!

ఇంటికివచ్చిన సావిత్రిని అలా అడగటం అసభ్యం అనుకున్నాడు. ఎన్నయినా అనుకోనీ తన అభిప్రాయం తెల్పినందుకు శేఖర్ హృదయం తేలికయింది. దీర్ఘంగా నిశ్వాసించాడు. కారు మలుపుతిరిగి వెళ్ళి పోయింది. తన మస్తిష్కంలో ఆమె ప్రతిరూపం మెరిసింది సావిత్రి తనది అనే నిర్ణయం దృఢంగా యేర్పడింది.

సావిత్రికి ఆ రాత్రంతా ఒకటే కలవరం. ఏం సమాధాన యివ్వాలో తెలీడం లేదు. శేఖర్ వ్రాసిన తన ప్రతిరూపం గుర్తుకొచ్చింది ఎంత చక్కగా చిత్రించాడు! అతనో కళారాధకుడు. తనో కళాప్రియ. తన ప్రతిరూపానికి మెరుగులు దిద్దిన అతనికే తన జీవన సర్వస్వం అర్పించాలి. శేఖర్ తన భర్త కావడం తన అదృష్టం అనుకుంది.

ఆరాత్రి చాల భారంగా గడిచింది.

ఉదయమే కాలేజీకి బయలుదేరింది కారులో.

తన జడలో రెండు తెల్లగులాబీలు - మధ్య ఓ ఎర్రగులాబీ! తుషార బిందువులు మెరుస్తూ వున్నాయపూబాలల చెక్కిళ్ళపై.

శేఖర్ తనను చూసి సంతోషిస్తాడు తన అభిప్రాయం వ్యక్తమవుతుంది. అబ్బ! అతనెంత నిశితమైన మనస్సు కలవాడు. ఎలాగైనా కళాకారులు తెలివికలవారు సుమా అనుకుంది. వివాహానంతరం శేఖర్ తన తలలో గులాబీలను తురుముతూ తనను .

సావిత్రి బాహ్యస్మృతి కోల్పోయింది. ఆమె మానస ఫలకంలో శేఖర్ దాయా చిత్రం తప్ప మరేమీలేదు.

కాలేజీ గేటుపద్ద కారాగింది. కాలేజీ అవరణలో శేఖర్ కన్పించలేదు. తనెంతో ఆశతో వచ్చింది. రోజూ తనరాక కొరకు శేఖర్ ఎదురుచూస్తూ వుండేవాడు. తన జడలోని గులాబీలను చూసి క్లాసుకువెళ్ళేవాడు. ఎంత మోసం చేశాడు అనుకుంది.

ఓసారి తన జడలోని గులాబీలను సవరించుకోబోయింది. గులాబీలు లేవు! కారులో జారిపడి పోయాయి. తను గమనించలేదు! శేఖర్ ఎంత బాధపడతాడో! జరిగిన పొరపాటును స్వయంగా చెప్పి క్షమాపణ కోరాలనుకుంది. కాలేజీ గేటు వరకు వచ్చి చూసేసరికి కారు వెళ్ళిపోయింది. శేఖర్ దర్శనం శూన్యం! తనను అవమానపరచిందని అతనెంత ఫీలౌతాడోననే ఆందోళన ఎక్కువయింది.

గులాబీలు తనను మోసం చేశాయి. శేఖర్‌ను తనకుదక్కనివ్వలేదు గులాబీలు. ఆనాటినుండి శేఖర్ కన్పించలేదు. తన ఆశాసౌధాల్ని రూపం లేకుండా నాశనం చేశాయి గులాబీలు.

సావిత్రి చేసిన పొరపాటు తన తలలోని గులాబీలు కారులో జారిపడటం గమనించక పోవడమే! ఆ మాత్రపు చిన్న పొరపాటుకే తన జీవితం సుగంధ రహిత సుమంలా నిష్ప్రయోజనమయింది. శేఖర్ కన్పించలేదు. తాను ఏకాకి అయింది. ఆనాటినుండీ సావిత్రికి గులాబీలంటే అయిష్టం.

గులాబీలను క్షమించరాదనుకుంది. గులాబీలను తాకదు ఈనాటికీ!